1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 27 డిసెంబర్ 2023 | www.navatelangana.com

భూమిని లాక్కొని మోసం చేసిన బీఆర్ఎస్



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొంతమంది దళిత కుటుంబాల భూములు లాక్కొని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని పలువురు ఆరోపించారు. మంగళవారం రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాదులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామవరం శివారులోని నందారం స్టేజి వద్ద 176 సర్వే నెంబర్ లో ఉన్న 26 ఎకరాల 28 గుంటల భూమిని కొంతమంది దళిత కుటుంబీకుల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్నదని ఆరోపించారు. ఆ భూమికి సరైన పరిహారం చెల్లించకపోవడంతో దళిత రైతులంతా ఉపాధి లేక రోడ్డున పడ్డారని తెలిపారు. ఈ భూమి తీసుకున్న సమయంలో భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికి దళిత బంధు, డబల్ బెడ్ రూమ్ అందిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని తెలిపారు. అప్పటి జిల్లాస్థాయి అధికారులు వచ్చి మమ్మల్ని బెదిరించి సంతకాలు తీసుకొని మోసం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆ భూమికి సంబంధించి త్వరలో కలెక్టర్ ద్వారా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దళిత కుటుంబీకులు అందరికీ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు లింగాల యాదమ్మ, బంగారి కనకయ్య, లింగాల లచ్చవ్వ సుశీల,తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖను పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-కోహెడ



నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు గడుస్తున్నా కీలకమైన విద్యాశాఖకు మంత్రి పదవిని కేటాయించకుండా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ శాతవాహన యూనివర్సిటీ ఇంఛార్జీ చుక్క శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని కోరారు.

రేపటినుంచి దరఖాస్తులు స్వీకరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ప్రజాపాలన కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడానికి మంచి వాతావరణం, వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, మునిసిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులు ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీలవారీగా ప్రజాపాలన షెడ్యూల్ ప్రదర్శించాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ సెక్రటరీ, కరోబార్, ఏఎన్ఎం, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, బిల్ కలెక్టర్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులతో కూడిన గ్రామ స్థాయి బృందాలతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. దరఖాస్తుతో పాటు ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్ కార్డు జతపరచాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున గ్రామపంచాయతీలో కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.ఇతర దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కౌంటర్‌కు ఒక రిజిస్టర్ మైంటైన్ చేయాలన్నారు. జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ బుధవారం మధ్యాహ్నం సంగారెడ్డిలో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని ఆర్డీవోలు, తాసిల్దార్‌లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ నాగరాజమ్మ, పిడి డిఆర్డిఏ జయదేవ్ ఆర్య, డిపిఓ దేవకీదేవి, జడ్పీ సీఈఓ రమేష్, ఆర్డీవోలు రమేష్, బన్సీలాల్, బెన్ శాలెం తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో మరో అరుదైన ఆపరేషన్



నవతెలంగాణ-దుబ్బాక

కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులోంచి ఐదు కిలోల ఫైబ్రాయిడ్ గడ్డను తొలగించారు దుబ్బాక ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రి వైద్యులు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వంగ లక్ష్మి(42) గత ఏడాది నుండి కడుపునొప్పితో బాధపడుతోంది. మూడ్రోజుల కిందట ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో చేరింది. సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె కడుపులో సర్వైకల్ ఫైబ్రాయిడ్ గడ్డలు ఉన్నట్లు నిర్ధారించారు. డా.హేమరాజ్ సింగ్ నేతృత్వంలోని డాక్టర్ల బృందం మంగళవారం ఆపరేషన్ చేసి ఐదు కిలోల ఫైబ్రాయిడ్ గడ్డను గర్భసంచిని విజయవంతంగా తొలగించారు. దుబ్బాక పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి వైద్య ,ఆరోగ్య సమస్యలున్నా ఏరియా వంద పడకల ఆసుపత్రికి రావాలనని డాక్టర్ హేమరాజ్ సింగ్ కోరారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ సస్పెండ్

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బైరగొని శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నుండి సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పార్టీ నిర్ణయాలకు, క్రమశిక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పార్టీకి వ్యతిరేకంగా కోవర్ట్‌గా వ్యవహరించారని, అందుకే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా ఏ కార్యక్రమాలు చేసినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని భవిష్యత్తులో పార్టీ నిర్ణయాలకు పార్టీ నాయకులు కార్యకర్తలు కట్టుబడి పని చేయాలని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-గజ్వేల్

ఈ నెల 27న గజ్వేల్ పట్టణంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సక్సెస్ చేయాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి తెలిపారు. మంగళవారం ఆయన ఇంటిలో విలేకరులతో మాట్లాడుతూ అందరి సహకారంతో స్థానిక వేజ్ నాన్ వెజ్ మార్కెట్లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. స్థానిక ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 20 వార్డుల కౌన్సిల్ సభ్యులు కార్యక్రమానికి హాజరై తమ వార్డు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకునేలాతోడ్పాటు అందించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

నవతెలంగాణ-కోహెడ



ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు న్యాయం చేకూరనుందని ఆ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాకేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తున్నాని తెలిపారు. మిగతా పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాంతాల శివారెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జేరిపోతుల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి కొమీరే రాజశేఖర్, మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు గర్రిపల్లి రాజు, శాతవేని అజయ్, శామంతుల వెంకటేష్, బోలుమల్ల అనిల్, జేరిపోతుల సుభాష్ పాల్గొన్నారు.

ఘనంగా మహా మండలపూజ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ అయ్యప్ప దేవాలయంలో మహా మండలపూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగడి పెట్ హనుమాన్ దేవాలయం నుండి అయ్యప్ప దేవాలయం వరకు అయ్యప్ప స్వామి ఆభరణాలు అయ్యప్ప స్వాములు ఊరేగించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎన్.సి రాజమౌళి,కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య గురు స్వామి, అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి మాట్లాడారు.

కేవల్‌కిషన్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు







- జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి కేవల్ కిషన్
- సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు
- పార్టీ సంగారెడ్డి జిల్లా కమిటీ అధ్వర్యంలో ఘనంగా కేవల్ కిషన్ వర్ధంతి





నవతెలంగాణ-సంగారెడ్డి

కేవల్ కిషన్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని.. తన జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ అధ్వర్యంలో కేకే భవన్‌లో మంగళవారం కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా చుక్క రాములు మట్లాడుతూ.. తొలితరం కమ్యూనిస్టు యోధుడు పేదల పక్షపాతి, నిస్వార్ధపరుడు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించిన ఉద్యమకారుడు కేవల్ కిషన్ అని కొనియాడారు. మెదక్ ప్రాంతంలో చిన్న శంకరంపేట మండలం తురకల మాందాపూర్ గ్రామంలో 1920 మే 10 న జన్మించి పేద ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాట నిర్వహించాడన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా.. పేదలకు భూములు పంచాలని మొట్టమొదట పోరాటం నిర్వహించిన మహనీయుడని కొనియాడారు. మెదక్ ప్రాంతంలో అనేక గ్రామాల్లో పేదలకు భూములు పంచిన నాయకుడని, తనకు వచ్చిన సొంత ఆస్తిలో నుంచి 200 ఎకరాల భూమిని పేదలకు పంచినట్టు చెప్పారు.అంటరానితనం, కులవివక్ష వ్యతిరేక పోరాటాలు నిర్వహించారు. తహసీల్దార్ ఉద్యోగం వచ్చినా.. దాన్ని వదిలి జీవితాంతం ప్రజల సంక్షేమం కోసమే పని చేసిన గొప్ప మహానుభావుడు కేవల్ కిషన్ అని అన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని.. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాబోయే కాలంలో ప్రజా పోరాటాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, రాజయ్య, మానిక్, రామచందర్, సాయిలు, నర్సింహారెడ్డి, నాయకులు యాదవరెడ్డి, నర్సింలు, యాదగిరి, మహిపాల్, కృష్ణ తది తరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మెదక్

పీడిత ప్రజల హక్కుల కోసం భూస్వాములకు వ్యతిరేకంగా కామ్రేడ్ కేవల్ కిషన్ పోరాడి కొన్ని వేల ఎకరాల భూములను పేదలకు పంచిన యోధుడని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం మెదక్‌లోని సీపీఎం భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బసవరాజు ఆధ్వర్యంలో కేవల్ కిషన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కేవల్‌కిషన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏ.మల్లేశం మాట్లాడుతూ కేవల్ కిషన్ బడుగు, బలహీన మధ్యతరగతి ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. నాడు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలకు భూములు పంచాలని తెలిపారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజలను ఏకం చేశారని గుర్తు చేశారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతూ ఎర్రజెండా నీడలో నడిచిన మహా వీరుడు కేవల్ కిషన్ అని కొనియాడారు. కేవల్ కిషన్ ఆశయ సాధనకు పోరాడదామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నరసమ్మ, జిల్లా వ్యవసాయ సంఘం కార్యదర్శి మల్లేశం, సిపిఎం పార్టీ నాయకులు, జగన్, లచ్చగౌడ్, చౌకత్, రాజు వేణు, బాలామణి, గీత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- చేగుంట

తహసీల్దార్ ఉద్యోగం వదిలేసి పెత్తందారీ, జమీందారీ, జాగిర్దార్లకు వ్యతిరేకంగా పోరాడి, తన సొంత భూమిని పంచిన చరిత్ర కేవలం కిషన్‌దని, నిజమైన సాయుధ పోరాట రైతంగా వారసులే కమ్యూనిస్టులని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అన్నారు. చేగుంట మండలం పోలంపల్లి కేవలం కిషన్ సమాధి వద్ద మంగళవారం సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించారు. కేవల్‌కిషన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ 'నాడు భారతదేశం ఆంగ్లేయులు పాలనలో ఉంటే, రాష్ట్రం నిజాం పాలనలో ఉన్నయది. దొరలు, భూస్వాములు, జమీందార్లు, జాగిర్దార్ దేశ్ముఖ్‌ల చేతిలో రాష్ట్రం బందీగా ఉండేది. భూములన్నీ వీరి పేర్ల మీద ఉండేవి. రైతులు వీరి వద్ద కౌలుకు తీసుకొని సాగు చేసుకునేవారు. పంటలు పండించిన రైతులు వారికి శిస్తు కట్టకపోతే చిత్రహింసలు పెట్టేవారు. భారతదేశంలో రైతులు 70 శాతం మంది వ్యవసాయం మీదనే ఆధారపడి బతికే వారు. నిజాం ఏజెంట్లు, జమీందార్లు, జాగిర్దార్లు, దేశ్ముఖ్‌లు, భూస్వాములు కులవృత్తుల వారితో వెట్టిచాకిరీ చేయించినారు. మహిళలపై దాడులు కూడా చేశారు. నాడు వేటిచాకిరీకి వ్యతిరేకంగా సాకలి ఐలమ్మ సాయుధ పోరాటం చేసింది. దొరల పక్కన నిజాం ఉంటే.. రైతులు, ప్రజల పక్షాన ఎర్రజెండా ఉన్నది' అని గుర్తు చేశారు. పేదల కోసం తన సొంత భూమిని పంచిన కామ్రేడ్ కేవల్ కిషన్ మాసైపేట నుండి లూనాపై వస్తుండగా పోలంపల్లి శివారు వద్ద కొంతమంది భూస్వాములు, గుండాలు లారీతో గుద్ది అతన్ని హత్య చేశారని, పేదల కోసం పని చేసిన కేవల్ కిషన్ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే.మల్లేశం, గీత, లక్ష్మీ నరసమ్మ, జగన్, అజయ్, కమల, సిపిఐ నాయకులు నందం పాల్గొన్నారు.

నవతెలంగాణ- కొల్చారం

కేవల్ కిషన్ ఆశయ సాధన కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని ఆ పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కె.నర్సమ్మ అన్నారు. మంగళవారం కేవల్ కిషన్ వర్ధంతి నిర్వహించారు. కొల్చారంలో సీపీఎం ఆధ్వర్యంలో కేవల్ కిషన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ కేవల్‌కిషన్ జీవిత కాలం పేద బడుగు, బలహీన వర్గాల కోసం పని చేశారని గుర్తుచేశారు. రైతులు, రైతు కూలీల సమస్యల కోసం భూ సమస్యలపై పోరాటం చేశారన్నారు. భూములు ఎక్కువగా ఉన్న భూస్వాముల నుండి భూములను స్వాధీనం చేసుకుని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేశారన్నారు.

ఘనపూర్ మండలంలో జక్కన్న పేట గ్రామంలో భూస్వాముల భూములు వర్షం పడి చెరువులు నిండితే భూస్వాముల భూములు మునిగి పోతాయని చెరువుకు గండి కొట్టి పేదల భూములు పండకుండా చేస్తే ప్రజలకు అండగా ఉండి చెరువు గండి మూసి పేదలకు అండగా నిలిచారన్నారు. దీంతో పేదలు భూముల్లో పంటలు పండించుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. అక్కడి ప్రజలు ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రతి సంవత్సరం బండ్లు బోనాలు తిప్పి పండగ జరుపుతారని కొనియాడారు. మెదక్ జిల్లా కేంద్రంలో కేవల్ కిషన్ భవనం నిర్మించి నిరంతరం ప్రజల సమస్యల కోసం పోరాటాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజు, హమాలీ యూనియన్ అధ్యక్షుడు కిష్టయ్య సత్యయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

పీడిత ప్రజల విముక్తి కోసం కేవల్ కిషన్ తుది శ్వాస వరకు అలుపెరుగని పోరాటం సాగించారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో అమరజీవి కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిజం అజేయమని కష్టజీవులను ఐక్యం చేసి బలమైన పోరాటాలు నిర్వహించిన గొప్ప త్యాగధనుడు కేవల్ కిషన్ అని కొనియాడారు. ఉన్నతమైన జీవితాన్ని సైతం వదులుకొని ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నాయకుడన్నారు. కేవల్ కిషన్ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాల నెరవేర్చే విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు మేలు చేసే విధానాలు కాకుండా ధనవంతుల ప్రయోజనం నెరవేర్చే విధానాలు అనుసరిస్తున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని అప్పుడు మాత్రమే కేవల్ కిషన్ కి నిజమైన నివాళులర్పించిన వారం అవుతామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్ జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్,దాసరి ప్రశాంత్, జిల్లా నాయకులు జాలిగాపు శిరీష, రెడ్డ బోయిన అరవింద్, కొండం సంజు కుమార్, దండు లక్ష్మి, అనిత పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం









నవతెలంగాణ-సంగారెడ్డి

భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంగారెడ్డిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. మహబూబ్ ఖాన్, సంగారెడ్డి పట్టణ కార్యాలయంలో, మార్క్స్ నగర్‌లో సీనియర్ నాయకులు వజీర్ బేగ్, భగత్‌సింగ్ నగర్‌లో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎంఏ. ఖాజా, మగ్దుమ్‌నగర్ రెహమాన్, నారాయణ రెడ్డి కాలనీలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కాశీనాథ్, శ్రీనగర్‌లో రాములు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ.. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్న చరిత్ర ఏ పార్టీకి లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చరిత్రను వక్రీకరిస్తే ఊరుకునేది లేదన్నారు. ఎంపీల పాసులు తీసుకుని ఆరుగురు దుండగులు పార్లమెంట్ లోపలికి వచ్చి గ్యాస్ బాంబు వదలడాన్ని ప్రశ్నిస్తే.. ప్రతిపక్ష పార్టీ ఎంపీలను 146 మందిని ఒకేసారి సస్పెన్షన్‌కు గురి చేయడం దుర్మార్గమన్నారు. నోట్ల రద్దు మొదలుకొని జీఎం, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు, దేశభద్రత సంబంధించిన అనేక విషయాల్లో ప్రైవేట్ శక్తులను ప్రోత్సహించడం దుర్మార్గమైన చర్య అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో.. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఇంటికి పంపించడానికి ప్రతీ ఒక్కరు కంకణబద్దులు కావాలని పిలుపు నిచ్చారు. బతికినన్ని నాళ్ళు ఎర్రజెండా పట్టుకుని బతుకుతామని.. తాము చనిపోయిన రోజు ఎర్రజెండాను తమ చితిపై వేసుకొని చస్తామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.ఏ.కాజా, రెహమాన్, కాశీనాథ్, అనురాధ, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ పట్టణ కార్యదర్శి బాబానగర్ శివ రాములు, మల్లేశం, రజియా బేగం, నిర్మల, విజయ్, హమీద్, బి పాషా, యాదమ్మ శంకరయ్య భూమయ్య సురక్ష, సుజాత, సువర్ణ, ఉదయ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పేద, బడుగు, బలహీనవర్గాలు, శ్రామిక ప్రజల రక్షణ కోసం, వారి అభ్యున్నతి కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మందపవన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటూనే రైతులు, బడుగు బలహీన వర్గాల మహిళలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజానీకం కోసం పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐది అని అన్నారు. దున్నేవాడికి భూమి అనే నినాదంతో తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది అసువులు బాశారన్నారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సిపిఐది అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, పట్టణ కార్యదర్శి జి, బన్సీలాల్, సహాయ కార్యదర్శి ఆరిఫ్, సీనియర్ నాయకులు పిట్ల మల్లేశం, కర్ణల చంద్రం, రూరల్ మండల కార్యదర్శి మిట్టపల్లి సుధాకర్, మరియు పట్టణ నాయకులు బేక్కంటి సంపత్, భిక్షపతి, నర్సింహులు, రాజు, ఐలయ్య, రమేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల


ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని అంగడి బజారు వద్ద ఆ పార్టీ జెండాను అశోక్ ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకుడు ఈరి భూమయ్య ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పాలక వర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు, భూమి, రేషన్ కార్డులు, పింఛన్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సౌకర్యాల సాధనకై పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎర్రజెండాగా పేదల పక్షాన పోరాటాలు చేసి, అన్యాయాన్ని ఎదిరించి ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిలి యాదగిరి, వలబోజు నరసింహాచారి, బూరుగు సత్తయ్య గౌడ్, పొన్నబోయిన మమత, కత్తుల భాస్కర్ రెడ్డి, గూడెపు సుదర్శన్, నంగి కనకయ్య, తీగుళ్ల కనకయ్య, వెలుగల యాదగిరి, వెలుగల మురళి, ఎండి జహంలామద్దిన్, చేరాల స్వామి దాసు, చాప తిరుపతి, లచ్చయ్య, రాములు, కృష్ణ పాల్గొన్నారు.


నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో సీపీఐ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మండల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ జెండాను ఎగరేసిన అనంతరం ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి బోనగిరి శంకర్, వేల్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసేందుకు అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేల్పుల మల్లయ్య, బాల్‌రెడ్డి, చిట్యాల శేఖర్, అంతయ్య, రాజేశం, వెంకటయ్య మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి పిల్లి రజిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి

- మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి





నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ కార్యాలయంలో చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఏ.జ్యోతి ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణ, అవగాహన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ తుమ్మల మాట్లాడుతూ.. రేపట (గురువారం) నుంచి జనవరి 6 వరకు 8 రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అక్కడే దరఖాస్తు ఫామ్స్‌ను లబ్ధిదారులకు ఇవ్వడంతో పాటు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. సదరు దరఖాస్తు ఫారాలను 8 రోజుల్లో ఏదో ఒక రోజు ఆయా వార్డుల్లో నిర్వహించే వార్డుసభల్లో టీమ్ లీడర్‌గా ఉన్న అధికారికి ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వార్డు సభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. లబ్ధి దారులకు సరిపడా కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని, అనంతరం రిజిస్టర్‌లోనూ నమోదు చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. ప్రతి రోజు టీమ్ సభ్యులు వార్డుల్లోనే ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారని, వారు ల్లోని ప్రజలందరికీ మెప్మా సిబ్బంది స్వయం సహాయక సంఘాల ద్వారా తెలిపాలని కోరారు. కౌన్సిల్ సభ్యులు బా శెట్టి కృష్ణ, కల్పనాఉపేందర్ రెడ్డి, మహా దేవరెడ్డి, బిజిలి రాజు, ప్రమోద్ రెడ్డి, కవిత, యూసుఫ్ అలీ, చంద్రకళ గోపాల్, లావణ్య శశిధర్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు చౌటకూరి స్వరూప, ప్రజాపాలన టీం లీడర్లు మున్సిపల్ డీఈఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్ కుమార్, పవన్ టీపీఎస్, డిప్యూటీ తాహసీల్దార్ బాలరాజ్, వైద్య, పోలీసు, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీపీ సాయం



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని నల్తూర్ గ్రామానికి చెందిన గొల్ల శ్రీను, భాగ్యమ్మల పొలంలో గల గడ్డివాములు ప్రమాదవశాత్తు కాలి పోయాయి. ఈ విషయం తెల్సుకున్న ఎంపీపీ రవీందర్ గౌడ్ వెంటనే గ్రామానికి వెళ్లి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి రూ.10,000 రూ ఆర్థిక సహాయం అందించారు. దాంతో ఆ కుటుంబంతో పాటు గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతరం ఎంపీటీసీ జానా బాయి, నల్తూరు ఉప సర్పంచ్ రమేష్, డప్పు చంద్రయ్య, ఈశ్వరయ్య ,మల్లయ్య, శివ ,శ్రీకాంత్ శేకర్ ,భాస్కర్, నవీన్, నర్సింగ్ సాయి ,హరీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ బృందం



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా గెజిటెడ్ అసోసియేషన్ ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్స్ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీజీవో సంగారెడ్డి సభ్యురాలు ఎంపీడీవో కొండాపూర్ మధులత, ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్య కలిసిన బీరయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీరయ్య యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీరయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీసీ కుల గణన చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.చట్ట సభల్లో బీసీ లకు 52శాతం రిజర్వేషన్‌ల బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 44 శాతానికి పెంచాలన్నారు.ఈ డిమాండ్ల పై రాష్ట్ర వ్యాప్తంగా బహిరంగ సభలు, సదస్సులు నిర్వహించాలని.. అన్ని పార్టీల్లో బీసీల ప్రాతినిధ్యం పెరుగుటకు బీసీ సంఘం కృషి చేయాలని కృష్ణయ్యతో చర్చించినట్టు చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ మంది బీసీలు లోక్ సభలో అడుగు పెట్టుటకు బీసీ సంఘం కార్యాచరణను రూపొందించి.. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సగం ఎంపీ సీట్లు ఇచ్చుటకు రాజకీయ పార్టీలపై వత్తిడి తేవాలని.. దానికి అన్ని కుల సంఘాల నాయకులతో ఒక కోర్ కమిటీని, రాజకీయ వ్యవహారాల కమిటీని ఏర్పాటు చేసుకొని.. బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని చర్చించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం నాయకుడు నరేందర్, బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు అఖిల్, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షులు రాహుల్, శేఖర్,రఘు,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ప్రమాణ సెక్రటేరియట్ ప్రారంభం



నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రమాణ-2024 సచివాలయాలన్ని కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల మంగళవారం ప్రారంభించారు. గీతమ్‌లో ప్రతియేటా సాంకేతిక-సాహిత్య-నిర్వహణల మేలు కలయికగా నిర్వహించే మూడ్రోజుల పండుగకు సన్నాహకంగా ఈ కార్యాల యాన్ని ఏర్పాటు చేస్తారు. గీతం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తికి ఈ సందర్భంగా నివాళ్లర్పించారు. సాంకేతిక శిక్షణ, ఉపన్యాసాలు, పోటీలతో పాటు ర్యాంప్ వాక్, సింఫోనీ, కన్సర్ట్, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, కార్నివాల్, పలు యాజమాన్య మెళ కువలను నేర్పే పోటీల సమాహారంగా ఈ కార్యక్రమం కొన సాగుతుంది. ప్రమాణ కార్యాలయాన్ని ఆరంభించిన సందర్భంగా ప్రొఫెసర్ రాసుశాస్త్రి మాట్లాడుతూ.. నూతన సాంకేతికత మేళవింపుతో కార్యక్రమాలను ఎంపికచేసి, ఇతర కళాశాలల విద్యా ర్థులు విరివిగా పాల్గొనేలా వాటిని రూపొందించామని సూచించారు. రోబోటిక్స్, ఈ-యంత్ర, హ్యాకథాన్, డిజైన్ పోటీలతో పాటు ఇతరత్రా కార్యక్రమాలను అత్యాధునిక సాంకేతికతతో ఉండేలా చూడాలన్నారు. ప్రచారం విద్యార్థులను ఆకర్షిస్తుందని, ఎక్కువ నుంది పాల్గొంటేనే మన ఉత్సవ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని చెప్పారు. కార్యక్రమాల కూర్పు అనంతరం వెబ్‌సైట్‌లో అన్ని వివరాలను పొందుపరచి, ఇతర కళాశాలల విద్యార్థులకు ఆ సమాచారం చేరేలా చూడాలని సలహా ఇచ్చారు. గీతం హైదరాబాద్‌లో ఉన్న ఏడు స్కూళ్ళ (టెక్నాలజీ, మేనేజ్మెంట్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్, పబ్లిక్ పాలసీ) విద్యార్థులందరూ పాల్గొనేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ కరుణాకర్.బి సూచించారు. గత ఉత్సవాల కంటే ఈ ఏడాది ప్రమాణ-2024 మేటిగా ఉండేలా తీర్చిదిద్దమని ప్రమాణ నిర్వా హకుడు డాక్టర్ సి.త్రినాథరావులు సూచించారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, వివిధ విభాగాధిపతులు, పలువురు విద్యార్థులు ప్రమాణ-2024 కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఎంపీపీ బాలయ్య అన్నదానం



నవతెలంగాణ-జోగిపేట

అందోలు జోగిపేట శ్రీ ధర్మ శాస్త్రా అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు ఎంపీపీ జే.బాలయ్య మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు పి.నారాయణ, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ డిబి.నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, పులుగు గోపి, పి.వీరేశం, సుధాకర్ స్వామి, నాగిరెడ్డి స్వామి, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పివిఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల్లో కార్యకర్తలందరూ చురుకుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


హమాలీ కార్మికులకు గ్రాట్యువిటీ ఇప్పించిన ఘనత ఐఎన్‌టీయూసీదే..



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో హమాలీ కార్మికులకు గ్రాట్యువిటి ఇప్పించిన ఘనత ఐఎన్టీయూసీదేనని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో 26 మంది హమాలీ కార్మికులకు సుమారు రూ.12 లక్షల గ్రాడ్యూటీ ఇప్పించ్చిన ఘనత ఐఎన్టీయూసీదే అన్నారు. పరిశ్రమలో 26 మంది హమాలీ కార్మికులు లోడింగ్ అన్లోడింగ్‌లో పనిచేసి రిటైర్మెంట్, కొంతమంది కార్మికులు అనారోగ్యంతో మృతిచెందగా వారి కి చట్టపరంగా రావాల్సిన గ్రాట్యుటీనీ యాజమాన్యం, కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇప్పించినట్టు చెప్పారు. గడిచిన 20 ఏండ్లుగా కార్మికుల హక్కుల రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి, తెలంగాణ ప్రజానాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కార్మికులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు రతన్ సింగ్, మల్లేష్, నాయక్, అశోక్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

జోగిపేటలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ



నవతెలంగాణ-జోగిపేట

13వ వార్డులోని డాక్టర్ సోమేశ్వర్ ఇంటి వద్ద విశ్వేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో గురుస్వాములు వెంకటేశం, డి.సంతోష్, అనంత్ రాజ్, పవన్, నగేష్, కిరణ్, రామకృష్ణ, కృష్ణల సమక్షంలో సోమవారం రాత్రి కన్నుల పండుగ్గా మహా పడిపూజను భక్తి శ్రద్ధలతో జరిపించారు. సంగారెడ్డికి చెందిన పాండు అయ్యప్ప భజన మండలి సభ్యులు భక్తి పాటలను పాడుతూ.. అలరించారు. అయ్యప్ప స్వామి 18 మెట్లకు పూజ నిర్వహించి, కర్పూరని వెలిగించి, మంగళ హారతి పాటలతో పడిపూజ ముగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రంగ సురేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నారాయణ, మాజీ ఎంపీటీసీలు ఆకుల శంకర్, డీజి.వెంకటేశం, మాజీ కౌన్సిలర్లు నవీన్, గోపాల్‌రావు, మాజీ వార్డు సభ్యులు ప్రవీణ్ కుమార్, జ్యోతి సత్యం, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సత్యవ్రత్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా దత్త జయంతి ఉత్సవాలు

హాజరైన రాష్ట్ర వైద్య శాఖ మంత్రి



నవతెలంగాణ-ఝరాసంగం

ప్రశాంతతకు నిలయమైన బర్దిపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో దత్త జయంతి సందర్భంగా మంగళవారం చేపట్టిన పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామి, స్థానిక నాయకులు ఆలయ రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జ్యోతిర్లింగాలకు అభిషేకం నిర్వహించారు. గత మూడ్రోజుల నుంచి నిర్వహిస్తున్న 21 హెూమ దత్తయజ్ఞం, 5 చండి హెూమా గుండాల్లో పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలందరికీ దత్తాత్రేయ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. దత్తాత్రేయ స్వామి కృపా, కటాక్షలతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వారికి దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పూలమాల శాలవాతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు హనుమంత రావు పాటిల్, ఎంపీపీ దేవదాస్, నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్, వేణుగోపాల్ రెడ్డి, అన్సార్, తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమం ఆవరణంలో ప్రత్యేకంగా అలంకరించిన తొట్టెలలో దత్తాత్రేయునీ ఉత్సవ మూర్తికి అనసూయ మాతా ఆధ్వర్యంలో డోలారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.





మంత్రిని సన్మానించిన భరత్ సత్యనారాయణ

నవతెలంగాణ-కల్హేర్

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు భరత్ సత్యనారాయణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం 142 జీవోను వెంటనే రద్దు చేయాలని మంత్రికి భరత్ సత్యనారాయణ విన్నవించారు. గత పది నుంచి 15 ఏండ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు మరియు ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఆశ వర్కర్ల సమస్యలను మంత్రికు తెలియజేశారు. తెలియ జేశారు. వారికి న్యాయం చేయాలని.. నవంబర్ నెల వేతనాన్ని వెంటనే ఇప్పించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. రెండో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సమస్యలు తమ దృష్టిలో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే వారికి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న నవంబర్ నెల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని ఫోన్ ద్వారా హెల్త్ కమిషనర్‌ను సంప్రదించి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ టి.ప్రభు తెలంగాణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మేరీ సంపూర్ణ, మెదక్ జిల్లా అధ్యక్షులు సిద్ధప్ప, రసీదు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ప్రభాకర్, ముఖ్య సలహాదారులు టీ .సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఉమాకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, సిహెచ్ఓ, ఉద్యోగ సంఘనాయకులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'పై సమీక్షా సమావేశాలు

















నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రజా పాలన కార్యక్రమం కోసం నియోజకవర్గస్థాయి సమన్వయ సమావేశాన్ని ఓ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డీపీఓ సురేష్ మోహన్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరయ్యారు. ముందుగా డీపీఓ మాట్లాడుతూ.. రేపటి(గురు వారం) నుంచి వచ్చేనెల 6 తేదీకి వరకు ఆరు గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తులు తీసుకోవాలన్నారు. గ్రామసభలు నిర్వహించి అప్లికేషన్‌లో తప్పులు దొర్లకుండా నింపాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. జీవో ప్రకారం మాత్రమే ప్రజలకు చెప్పాలని.. పేపర్లలో వచ్చిన వాటిని ప్రజలకు చెప్పొద్దన్నారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. అప్లికేషన్లు నింపేటప్పుడు వాలంటీర్లు అవసరమైతే పెట్టుకుం దామని.. తప్పులు మాత్రం దొర్లకుండా నింపాలన్నారు. ప్రతి పక్ష పార్టీల నాయకులు అప్లికేషన్ నింపితే తప్పులు రాసే అవకాశం ఉంటుందని.. అలా కాకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఏదీ ఏమైనా ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ వెంకట్ రెడ్డి, మున్సిపల్ అధికారి మల్లారెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కల్హేర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల పథకం అమలుకు రేపట (గురువారం) నుంచి స్వీకరించనున్న దరఖాస్తుల కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కల్హేర్ మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు నరసింహరావు కోరారు. కల్హేర్ ఎంపీపీ సమావేశ మందిరంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో ఆరు గ్యారెంటీల పథకా లపై మంగళవారం సమీక్షా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, ఉచిత వంట గ్యాస్ వంటి పథకాల కోసం రేపటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు గ్రామపంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ సభల్లో అర్హులు ఎవరనేది ప్రజాప్రతినిధులకు అవగాహన ఉంటుందని.. వారితో దరఖాస్తులు చేయిం చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.ఈ కార్య క్రమంలో తహసీల్దార్ బాల శంకర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీని వాస్, ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య, జెడ్పీటీసీ నరసింహారెడ్డి, ఎస్సై వెంకటేశం, మండల కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : రేపటి నుంచి జరగనున్న ప్రజా పాలన కార్యక్రమం కోసం మండల కేంద్రంలో ఎంపీడీవో అధ్యక్షతన అవగాహనా సదదస్సును మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. రేపటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు గ్రామాల వారీగా గ్రామ పంచాయితీల వద్ద ప్రజా పాలన నిర్వహించేందుకు కార్యదర్శులు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. గ్రామ సభకు ఒకరోజు ముందుగా గ్రామంలో దండోరా డప్పు చాటింపు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

కొండాపూర్ : ఆరు గ్యారంటీల అమలుకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రజా పాలనకు గ్రామ అధికారులు సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో మధులత తెలిపారు. ఎంపీపీ మనోజ్ రెడ్డి, తహసీల్దార్ అనిత, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మధులత మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలను నియమించి, మహాలక్ష్మిగృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా,తదితర పథకాలు (ఆరు గ్యారెంటీ)ల కోసం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు రెండు విడుదలగా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి వారికి కావలసిన కుర్చీలు, టెంట్లు, తాగునీరు, మహిళలకు, పురుషులకు వేరువేరుగా క్యూలైన్లను తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు ఒకరోజు ముందు ప్రతి గ్రామంలో దండోరా(టామ్ టామ్) వేయించి ప్రతీ సామాన్య నిరుపేద కుటుంబాలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి.. వారికి తగ్గిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు.

జహీరాబాద్ : ప్రజా పాలన కార్యక్రమం అమలు కోసం ఎంపీపీ గిరిధర్‌రెడ్డి ఆధర్యంలో సమీక్షా సమావేశాన్ని ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం రేపటి నుంచి జనవరి 06- వరకు వుంటుందన్నారు. అందులో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. దానికి తోడు రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులు ఏమైనా వస్తే వాటిని కూడా స్వీకరించాలని సూచించారు. జహిరాబాద్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి తుమ్మ ప్రసాద్ మాటాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చిన నబంధనలను సంబంధిత శాఖ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు రాములు , ఎంపీడీవో సుమతి ఎంపీఓ మహేష్, సర్పంచ్ ఎంపీటీసీ తదితరురులు పాల్గొన్నారు.

జిన్నారం : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి జనవరి 6 వరకు గ్రామ సభలు నిర్వహించి. ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు, జిన్నారం తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక అధికారులు, పర్యవేక్షణ అధికార బృందాల నియామకం, నిర్వాహణా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలోని గ్రామపంచాయ తీలను రెండు టీములుగా విభజించి జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు గడ్డపోతారం, లక్ష్మీపతి గూడెం, వావిలాల, నల్తూర్, కాజిపల్లి, మంగంపేట రాళ్లకత్వ జంగంపేట గ్రామాలను పర్యవేక్షించునున్నారు. అలాగే జిన్నారం మండల తహసీల్దార్ రవికుమార్ అండూర్ శివానగర్ కొడకంచి మాదారం ఊట్ల, సోలక్‌పల్లి, జిన్నారంలో జరిగే గ్రామ పంచాయతీల్లో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

జోగిపేట : రేపనటి నుంచి జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆందోల్ మండల స్పెషల్ ఆఫీసర్ గీత అన్నారు. ఆందోల్ ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ జోగు బాలయ్య అధ్యక్షతన ప్రజా పాలన కార్యక్రమంపై సర్పంచ్లకు, అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకో వాలన్నారు. మహిళలకు, పురుషులకు వేరువేరుగా దరఖా స్తులు తీసుకుంటారన్నారు. ప్రభుత్వ పథకాల తోపాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను కూడా దరఖాస్తుల రూపం లో తెలియజేయాలన్నారు. కుటుంబంలో ఒక్కరు మాత్రమే పథకాలకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కే.రమేష్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీఓ సౌజన్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల కార్యదర్శిలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేబీఎస్ ఇండస్ట్రీపై చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవ రెడ్డి



నవతెలంగాణ-ఝరాసంగం

రైతుల భూమిని అక్రమంగా ఆక్రమించుకొని కేబీఎస్ ఇండస్ట్రీ మైనింగ్ చేస్తున్నదని.. వెంటనే ఆ ఇండస్ట్రీపై అధికారులుచర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో రైతుల భూమిని మైనింగ్ చేస్తూ.. 33 ఫీట్ల ప్రభుత్వ నక్షబాట దారి మూసివేయడంతో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ బృందం మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. కేబిఎస్ ఇండస్ట్రీ గత పదేండ్ల నుంచి ఈదులపల్లి గ్రామ శివారులో అక్రమంగా మైనింగ్ చేస్తున్నదన్నారు. వారికి సర్వే నంబర్ 21లో మాత్రమే అనుమతి ఉండగా.. 180, 179 సర్వే నంబర్లల్లో భూమి కొన్నాము అనే పేరుతో పక్కనే ఉన్న 177 సర్వే నంబర్‌లో మైనింగ్ చేస్తున్నదన్నారు. దాదాపు 83 ఎకరాల భూమికి సంబంధించి 1971లో అప్పటి ప్రభుత్వం రైతులకు పట్టాలు ఇచ్చిందని.. ఇప్పుడు మైనింగ్ అధికారులు పక్కనే ఉండడంతో రైతులకు తెలియకుండానే జెసిబిలు పెట్టి భూమిని ఆక్రమించుకొని మొత్తం గోతులు తీసి వ్యాపారం చేస్తున్నరన్నారు. రైతులు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారన్నారు. కాబట్టి వెంటనే సంబంధిత మండల, జిల్లా స్థాయి అధికారులు స్పందించి.. రైతుల భూమిని ఆక్రమించుకున్న కేబీఎస్ ఇండస్ట్రీపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తగు న్యాయం చేయాలని, దారిని పునరుద్ధరించాలన్నారు. లేనిఎడల పక్షంలో పెద్ద ఎత్తున రైతులతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ మల్లారెడ్డి గారు జిల్లా కమిటీ సభ్యులు నరసింహారెడ్డి శ్రీనివాస్, రైతులు సంజీవ్ కుమార్, రమేష్, శంకరయ్య, మ్మప్ప, అంజప్ప, లింగప్ప, నర్సింలు, బసవరాజ్, శంకరయ్య రాములు, బసంతి, రాజు తదితరులు ఉన్నారు.

కేవల్ కిషన్ ఆశయాలకనుగుణంగా ముందుకు వెళ్దాం



నవతెలంగాణ-పటాన్‌చెరు

కేవల్ కిషన్ ఆశయాలకనుగుణంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావులు అన్నారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో సీపీఐ(ఎం) పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నేత కేవల్ కిషన్ 63వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ కేవల్ కిషన్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని కేవల్ కిషన్ నిర్మించాడని.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరుగుతున్న సమయంలో జిల్లాలో పేదలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన భూములు పంచి పెట్టారని గుర్తు చేశారు. తహసీల్దార్ ఉద్యోగం వచ్చినా.. ఉద్యోగాన్ని వదులుకుని పేదల కోసం కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుండి నడిపించారన్నారు. 1960లో ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినా.. ఇప్పటికీ ఆయన మరణం సందేహంగానే ఉందన్నారు. భూ స్వాముల చేతుల్లో చంపబడ్డారని అనుమానంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్ శ్రీనివాసరావు, ఎంజివి ఎస్ ప్రసాద్, వెంకట్ రామ్ రెడ్డి,మూర్తి,ఉదయ్,రాజ్ కుమార్,సదాశివ రెడ్డి,ప్రదీప్ మహేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర అక్షింతలతో శోభాయాత్ర



నవతెలంగాణ-జిన్నారం

అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగంగా వచ్చిన అక్షింతలు, కలశాలను తలపైన పెట్టుకొని మండల కేంద్రం లోని హనుమాన్ ఆలయం నుంచి ప్రత్యేక శోభాయాత్రను మంగళవారం నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమి తి ప్రతినిధి బృందం, గ్రామస్తులు కలిసి ఈ శోభాయాత్రలో పాల్గొని.. జైశ్రీరామ్.. జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు రమేష్ కోదండ రామాలయం చైర్మెన్ బురెడ్డిగారి బూచిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్

బుధవారం | 27 డిసెంబరు 2023 | www.navatelangana.com

ప్రజా పాలనతో సమస్యల పరిష్కారం

ప్రతి మండలంలో ఇంటర్ నేషనల్ స్కూల్ : అదనపు కలెక్టర్ రమేష్



నవతెలంగాణ-మెదక్

ప్రజా పాలనతో సమస్యలు పరిష్కారమవుతాయని అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ నెల 28 నుంచి ప్రారంభం కాబోయే ప్రజాపాలన కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనతో ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, జిల్లా యంత్రాంగం ప్రజాపాలన నిర్వహణకు సిద్దంగా ఉందన్నారు. ప్రజలు ప్రజా పాలనను ఉపయోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేదన్నారు. ప్రతి 100 మందికి ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు స్వీకరించాలని, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు 6 గ్యారంటీలకు అర్హులేనన్నారు. మెదక్ జిల్లాలో ప్రతి మండలంలో ఇంటర్ నేషనల్ స్కూల్ ఏర్పాటు కోసం 10 ఎకరాల స్థల పరిశీలనకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అమరవీరుల కుటుంబాలు 250 గజాల ఇంటి స్థలం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన ధరఖాస్తులన్నీ ఆన్లైన్ చేస్తామని తెలిపారు.

నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో జరుగుతున్న శ్రీ సీతాలమ్మ నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ జాతర ఉత్సవాల్లో మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతా రెడ్డి గెలిస్తే 51 కొబ్బరికాయలు కోడుతానని అచ్చంపేట మాజీ సర్పంచ్ బిక్షపతి నల్ల పోచమ్మ ముత్యాలమ్మలకు మొక్కాడు. అయితే సునీత రెడ్డి చేతుల మీదుగా కొబ్బరికాయలు కొట్టించి తన మొక్కును తీర్చుకున్నాడు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భోగచంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, సుధాకర్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు సంగీతా ఆంజనేయులు, సేనాధిపతి, లావణ్య రవి, వెంకటేష్ గౌడ్, అచ్చంపేట గ్రామస్తులు పాల నరసయ్య, శ్రీనివాస్ గుప్తా, నీరుడు బిక్షపతి, సాయిలు, ఆంజనేయులు, కృపాచారి, హరికృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు వాయిదా

జెడ్పీ సీఈవో శైలేష్

నవతెలంగాణ-మెదక్

ప్రజా పాలన ప్రారంభ కార్యక్రమం ఉన్నందున ఈ నెల 28, 29న జరిగే జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘం సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈవో శైలేష్ తెలిపారు. ఈ సమావేశాలను తిరిగి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-వెల్దుర్తి





ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలను బలోపేతం చేసేందుకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన గుడ్డి శోభారాణి మాదిగను మాదిగ మహిళా సమైక్య జిల్లా అధికార ప్రతినిధిగా, ముక్క వినోద్ మాదిగను మాదిగ విద్యార్థి సమైక్య జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, జిల్లా ఇన్చార్జి లింగంపల్లి శ్రీనివాస మాదిగల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ తెలిపింది. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రజాపాలనపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలతో కలిసి ప్రజా పాలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఎమ్మార్వో షేక్ కరీం, ఎంపీపీ సబిత, జడ్పిటిసి బాణాపురం కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ప్రజలకు ప్రజా పాలన కార్యక్రమం గురించి ముందస్తుగానే పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మార్వో కరీం, ఎంపీడీవో ఆనంద్ మేరీలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, 2 నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. చాటింపు ద్వారా ప్రజలకు ప్రజా పాలన కార్యక్రమం గురించి తెలియజేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా టెంట్లు, నీళ్ల, వైద్య బృందం అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత సర్పంచ్‌లదేనన్నారు. ప్రతి వంద మందికి ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. 28వ తేది నుంచి జనవరి 6 వ తేది వరకు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత మొదలగు పథకాల కోసం ప్రతి గ్రామం లో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తులు పూర్తి చేయడం రాని వారికి సహకరించాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం మండలంలో అమలు పరచాల్సిన పట్టికను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయంలో అన్నదానం



నవతెలంగాణ-టేక్మాల్

దత్తాత్రేయ ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పల్వంచ గ్రామం వెలసిన దత్తాత్రేయ ఆలయంలో మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణంలో భజన భక్తులు మూడు రోజులపాటు భజన, అఖండ ఆరాధన, కుంకుమార్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం దత్తాత్రేయ ఉత్సవాలు చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ధర్మకర్త కూచంపల్లి, సంగమేశ్వర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని దగ్గరుండి చూసుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

అనారోగ్యంతో మృతి చెందిన శ్రీపతి నర్సా గౌడ్ కుటుంబానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి నర్సాగౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు సమాచారం అందించారు. తక్షణ సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేయాలని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీపతి నర్సాగౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిట్యాల శ్రీనివాస్, సాయిబాబు, అరికెల బాలరాజ్, గోపాల్, వెంకట్, సత్యనారాయణ, లక్ష్మణ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కే వెంకటాపూర్ గ్రామానికి చెందిన చెనమైన సత్యం భార్య అనిత మృతి చెందారు. బీఆర్ఎస్ కార్యకర్తగా పని చేసిన ఆమె కుటుంబానికి సర్పంచ్ అనిల్ కుమార్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనిత కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు అక్కల దుబ్బరాజు, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సిద్ధిరాములు, పిఏసిఎస్ డైరెక్టర్ మైపాల్, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి, పెంటయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనకు శ్రీకారం

- 28 నుంచి జనవరి 6 వరకు సభలు
- ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్



నవతెలంగాణ-మెదక్

పరిపాలన సౌలభ్యాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్ తెలిపారు. మంగళవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు రమేష్, వేంకటేశ్వర్లులతో కలిసి ప్రజాపాలన గ్రామ, వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకుని వెళ్లడమే ప్రభుత్వ అధికారుల బాధ్యత అని, ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతి మండలం పరిధిలో తహసిల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి, ప్రతిరోజు ప్రతి బృందం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షెడ్యూల్లో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజాపాలన సభలలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి దరఖాస్తులు ఒకరోజు ముందుగానే వస్తాయని, గ్రామ ప్రజలకు ముందుగానే దరఖాస్తులు అందించాలని, దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు పూర్తి చేసి గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలోని నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరించేలా చూడాలన్నారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించిన షెడ్యూలు అందించడం జరుగుతుందని, ప్రజాపాలన నిర్వహణపై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రజా పాలన సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు తెలియజేయాలని, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య సిబ్బందిచే ప్రచారం చేయాలని సూచించారు. ప్రజాపాలన సభ నిర్వహణకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని త్రాగునీరు, కుర్చీలు, అవసరమైన బల్లలు ఏర్పాటు చేయాలని, ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు స్వీకరించాలని, ఆధార్, రేషన్ కార్డు జత చేసేలా చూడాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, వీల్ చైర్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు ఫారంలు అందిన వెంటనే మండలాలకు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ప్రతిరోజు ప్రజాపాలన సభలలో తీసుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి రసీదు అందించాలని, ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రజాపాలన గ్రామసభ నిర్వహించే ప్రదేశం, సమయం, వివరాలు ముందస్తుగా ప్రచారం చేయాలని, స్థానిక జడ్పిటిసి, ఎంపిటిసి సర్పంచ్, మొదలగు నాయకులకు తప్పనిసరిగా ఎంపీడీవో లేదా తహసిల్దార్ ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలన్నారు. గ్రామసభ నిర్వహణ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హవనం

నేడు మండల మహా పడి పూజ



నవతెలంగాణ-మెదక్

మండల మహాపడి పూజను పురస్కరించుకొని మంగళవారం స్థానిక అయ్యప్ప దేవాలయంలో గణపతి హవనం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మూల మూర్తుల హావనం, నవగ్రహ దిక్పాలక హావనం, క్షేత్ర పాలక బలి ప్రధానం, పూర్ణాహుతి నిర్వహించారు. గురుస్వాములు హరిదాస్, వైద్య రాజు, వేద పండితులు వైద్య రాజు, అంకుష్ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ గణపతినల్ హవనం జరిగింది. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు మహా పడి పూజ

అయ్యప్ప దేవాలయంలో బుధవారం మండల మహా పడి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వైద్య రాజు తెలిపారు. ఉదయం 5:05 గంటలకు సుప్రభాత సేవ, స్వస్తి వా, శ్రీ గణేష, సుబ్రమణ్య పూజ, అయ్యప్ప స్వామి రుద్రాభిషేకం, సహస్ర నామార్చన అభిషేకం, నక్షత్రం హారతి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి అశోక్, గురుస్వాములు గంగ లక్ష్మీ పతి, రామాంజనేయులు, వీర్ కుమార్, కొండ శ్రీను, సత్యనారాయణ, పురం వెంకట్ నారాయణ, పార్థివనాథ్, శ్రీకాంత్ రెడ్డి, రమేష్, ఆలయ బాధ్యులు చక్రపాణి, రాజన్ పాల్గొన్నారు.

ప్రజా పాలనపై అవగాహన సదస్సు

నవ తెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని ప్రజా పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు అధ్యక్షతన సదస్సును ఏర్పాటు చేశారు. ఎంపీడీవో జగదీశ్వర్ చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలను అమలు చేయడానికి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రతి గ్రామపంచాయతీ వద్ద దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, యువ వికాసం, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఎం గోవిందు, ఎంపీ ఓ రాజేందర్, విద్యుత్తు ఏఈ గణేష్, ఏ పీ ఓ శ్రీనివాస్, పంచాయత్ రాజ్ ఎ ఇ శరత్, ఇరిగేషన్ ఏఈ బిక్షపతి, వర్క్ ఇన్స్‌పెక్టర్ మారాజ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అమర సేనా రెడ్డి, చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి, తిప్పనగుల్ల సర్పంచ్ చంద్ర వర్ధిని యాదగిరి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శిలు హరీఫ్ హుస్సేన్, ప్రశాంత్ గౌడ్, నరసింహులు, కవిత, శ్యామల, మమత, నరసింహారెడ్డి, యాదవ లక్ష్మి ,శ్యామల, వివిధ గ్రామాల నాయకులు రవి, సిద్ధరాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న మాజీ సర్పంచ్



నవతెలంగాణ-కొల్చారం

నర్సాపూర్ ఎమ్మెల్యేగా వాకిటి సునితా లక్ష్మారెడ్డి విజయం సాధించడం పట్ల అప్పాజీపల్లి మాజీ సర్పంచ్ నాయిని సునీతా వెంకట్ గౌడ్, ధనరాజ్‌లు మొక్కులు తీర్చుకున్నారు. ఇటీవల జరిగిన నర్సాపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వాకిటి సునితాలక్ష్మారెడ్డి విజయం సాధిస్తే కర్ణాటక రాష్ట్రంలోని గణాగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తామని వారు మొక్కుకున్నారు. వారి కోరిక మేరకు సునితా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం గణాగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సునితా లక్ష్మారెడ్డి విజయం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనురాజ్, రాజుగౌడ్, ఆంజనేయులు, పాండరీ, పశుపతి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఆరు గ్యారంటీలు అందేలా కృషి చేయాలి

నవతెలంగాణ-చిలిపిచేడ్



ప్రజా పాలనలో భాగంగా 6 గ్యారెంటీలు అర్హులకు అందేలా అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి కృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాలలో ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ వద్ద కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా పాలనతో సమస్యలు పరిష్కారం

మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి

నవతెలంగాణ-హవేలిఘనపూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనతో సమస్యలు పరిష్కారమయ్యే విధంగా ప్రతి అధికారి కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలన కార్యక్రమం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్రజాపాలనను ఉపయోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రజా పాలన దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేదన్నారు. ప్రతి 100 మందికి ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు స్వీకరించాలని, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు 6 గ్యారంటీలకు అర్హులేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి తహసిల్దార్ నారాయణ, ఎంపీడీవో శ్రీరామ్ ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో రియాజుద్దీన్

నవతెలంగాణ టేక్మాల్



ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి రియాజుద్దీన్ అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీల కోసం ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీలో ఒకటి నుంచి 100 ఇండ్ల వరకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని సమస్యల పరిష్కారినికి మరో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క రోజు రెండు గ్రామపంచాయతీలలో రెండు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక టీంకు మండల అభివృద్ధి అధికారి బాధ్యులుగా ఉంటే మరో టీంకు మండల రెవెన్యూ అధికారి బాధ్యులుగా ఉంటారన్నారు. అధికారులకు ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు ప్రభుత్వం తరపున రశీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిజమైన అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు చింత స్వప్న రవి, ఆయా శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
బుధవారం | 27 డిసెంబర్ 2023 | www.navatelangana.com

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో మంగళవారం దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా అయ్యప్ప దేవాలయంలోని దత్తాత్రేయ విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య గురు స్వామి, అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ గురు స్వామి, పురోహితులు నందుపంతులు మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి సూక్తులు అనుసరణీయమని వారు చూపిన బాటలో నడవాలన్నారు. దత్తాత్రేయ స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలన్నారు. అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గానుగాపూర్‌లోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న మోక్షం ఇక్కడ గజ్వేల్ లో దత్తాత్రేయ స్వామిని దర్శించుకుంటే కలుగుతుందన్నారు.

నిమ్మ ధర్మారెడ్డి మృతి సీపీఐకి తీరనిలోటు



నవతెలంగాణ-బెజ్జంకి

సీపీఐ మండల నాయకుడు నిమ్మ ధర్మారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందిన నిమ్మ ధర్మారెడ్డి మృత దేహానికి మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి బోనగిరి రూపేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లాధ్యక్షులు సంగెం మధు సీపీఐ పార్టీ జెండా కప్పి పూలు కప్పి నివాళు లర్పించారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియలలో పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపే మల్లేష్,ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బోనగిరి మహేందర్, జిల్లా అధ్యక్షులు సంగెం మధు, కరీంనగర్, సిద్దిపేట జిల్లా సీపీఐ కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి,బూడిద సదాశివ,ఎడల వనేశ్,గూడ పద్మ, అయిలేని సంజీవ రెడ్డి,బెజ్జంకి మండల సీపీఐ నాయకులు దొంతరవేని మహేష్,శ్రవణ్, రాకేష్, చరణ్, హరీష్,నర్సయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

28న ఇంటర్ స్కూల్ డిస్ట్రిక్ట్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ టోర్నీ



నవతెలంగాణ- సిద్దిపేట

ఈ నెల 28 నుండి ఇంటర్ స్కూల్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ ఫుట్బాల్ టోర్నమెంట్ జరగనుందని సిద్దిపేట ఫుట్ బాల్ అసోసియేషన్ ఇంచార్జ్, ఫుట్బాల్ కోచ్ అక్బర్ నవాబ్ తెలిపారు. మంగళవారం పోటీలకు సంబంధించిన పోస్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెకండ్ ఎడిషన్ పేరుతో ఫుట్బాల్ టోర్నమెంట్ ఉంటుందని, మాజీ మంత్రి ,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆర్గనైజ్ వహిస్తున్న ఈ టోర్నమెంట్ లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్ స్కూల్ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమం సిద్దిపేట ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉంటుందని తెలిపారు. టీం ల రిజిస్ట్రేషన్ కొరకు 9989484657, 9100226878 ఫోన్ నంబర్ లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ హరీష్ గౌడ్, మనీష్, వరుణ్, శ్రీకాంత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు మాట ఎత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎంపీపీ దాసరి అమరావతి శ్యాం మనోహర్



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు నెల రోజులకు వస్తున్నా రైతు బంధువు మాట ఎత్తడం లేదని గజ్వేల్ మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అమరావతి శ్యాం మనోహర్ అన్నారు. మంగళవారం ఆమె గజ్వేల్‌లో మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం రైతులను ఎంతో ఆదుకుందన్నారు. 6 గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను గారడి చేస్తోందన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన మాజీ ఎంపీపీ



నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను మంగళవారం హన్మకొండలోని ఆమె నివాసంలో చేర్యాల మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంటు టికెట్ ను తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర్ తో పాటు ఆయన సోదరుడు అంజయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనపై సమావేశం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రాఘవేంద్ర రెడ్డి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుండి జరగబోయే ప్రజా పాలన కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. దరఖాస్తులు తీసుకోవడానికి సరిపడా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు తోడేటి రమేష్ , ఏపీఎం శ్రీనివాస్ ,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులతో ప్రభుత్వానికి చెడ్డపేరు



నవతెలంగాణ-బెజ్జంకి

గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో పరిపాలన సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ప్రజాధనాన్ని దోపిడీ చేశారని, ప్రజాపాలన కోసం కంకణం కట్టుకున్న నేటి ప్రభుత్వం గ్రామసభల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయడంతో కాంగ్రెస్‌కు చెడ్డ పేరు వస్తుందని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఆర్టీఐ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికకు చేపట్టనున్న గ్రామ సభలను ప్రత్యేక అధికారుల సమక్షంలో నిర్వహించాలని సీఎంకు ఆయన లేఖ రాశారు.

ప్రజాపాలనలో కాంగ్రెస్ శ్రేణులు భాగాస్వాములు కావాలి



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములు కావాలని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య మంగళవారం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పరిపాలన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు చేర్చే బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని తెలిపారు.

అణగారినవర్గాల హక్కుల కోసం పోరాడేదే సీపీఐ

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

భారత దేశంలో 99 సంవత్సరాల క్రితం ప్రజల హక్కుల కోసం 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఎన్నో నిర్బంధాలు, నిషేధాలు, కుట్ర కేసులు ఎదుర్కొని దేశ సమైక్యత సమగ్రత పరిరక్షణ లౌకికవాదాన్ని కాపాడు కునేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ పాటుపడిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్ అన్నారు. మంగళవారం సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ మండల కేంద్రంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ వద్ద ఆరుణపతాకం ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అధికారం లేకపోయినా లక్షలాది ఏకరాల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు భూములు పంచి ఇచ్చిన ఘన చరిత్ర సిపిఐకి దక్కిందని గుర్తు చేశారు. పీడిత ప్రజల పక్షాన నిలబడి అలుపెరుగని పోరాట పటిమతో ముందుకు దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయడ కొమురయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి అయిలేని సంజీవరెడ్డి, గూడ పద్మ, ఎగ్గోజు సుదర్శన్ చారి, నాయకులు పొదిల కుమారస్వామి, ఇంద్రాల మల్లయ్య, దుద్దేడ రాజయ్య, ఎండి అక్బర్, శివరాత్రి మల్లయ్య, కాల్వల ఎల్లయ్య పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై లారీ బీభత్సం

- ఆటోను ఢీకొట్టిన లారీ
- ప్రమాదంలో ఒకరికి తీవ్ర, మరోకరికి స్వల్ప గాయాలు
- ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం





నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై బెజ్జంకి క్రాసింగ్ గ్రామ స్టేజ్ వద్ద మంగళవారం లారీ బీభత్సం సృష్టించింది. గుగ్గిల్ల గ్రామానికి చెందిన తుమ్మ మల్లేశం ఆటోలో అదే గ్రామానికి చెందిన రైతు నంగునూరి కనుకయ్య ముత్తన్నపేట గ్రామ శివారులో పత్తిమిల్‌లో పత్తి విక్రయించి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. బెజ్జంకి క్రాసింగ్ గ్రామ స్టేజ్ వద్ద రోడ్డు దాటడానికి రాజీవ్ రహదారిపై వాహనాల రాకపోకలను పరిశీలిస్తున్న క్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ తుమ్మ మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు కనుకయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మల్లేశంను చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. లారీ డ్రైవర్ మద్యం సేవించినట్టు పోలీసులు నిర్ధారించారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ అప్రమత్తతో బస్సుకు ప్రమాదం తప్పిందని ప్రయాణీకులు తెలిపారు. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుండి కరీంనగర్ వైపు వస్తుంది. ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ బెజ్జంకి క్రాసింగ్ స్టేజ్ వద్ద ప్రయాణీకులకు కోసం బస్సును నిలుపుదల చేశారు. వెనుక నుండి వస్తున్న లారీని పసిగట్టిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును ముందుకు తీసుకుపోయారు.

గంగమ్మ తల్లికి ఘనంగా హారతులు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట పట్టణంలోని స్థానిక కోమటి చెరువు దగ్గర ఉన్న గంగమ్మ దేవాలయం వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం సిద్దిపేట గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా హార తులు ఇచ్చారు. స్థానిక బోయిగల్లి నుండి కమాన్ మీదుగా గాంధీ నుండి విక్టరీ టాకీస్ చౌరస్తా నుండి గంగ పుత్ర మహిళలు మంగళ హారతు లతో ర్యాలీగా గంగమ్మ గుడికి చేరుకు న్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు అందరూ జల పందిరితో కోలాటం ఆడుకుంటూ ర్యాలీ తీసుకొ ంటూ గుడి వద్దకు చేరుకున్నా రు. అనంత ^రం గంగమ్మ గుడిలో వైభవంగా పూజలు నిర్వహించారు. తదనంతరం గంగపుత్ర గుడి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కోమటి చెరువులో తెప్పో త్సవ కార్యక్రమం నిర్వహించారు. తరువాత గంగమ్మ దేవాలయానికి వచ్చిన అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గంగమ్మ గుడి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏర్వ మల్లేశం, ఉపా ధ్యక్షులు గణేష్, సెక్రటరీ విజయ్, సిద్ది పేట గంగ పుత్ర సంఘం అధ్యక్షు డు బిజ్జి రాజం, ఉపాధ్యక్షులు పెంటం పోచయ్య, సెక్రటరీ కిషన్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం



నవతెలంగాణ-అక్కన్నపేట

సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యమని, దోపిడీ రహిత సమాజం కోసమే పని చేస్తోందని ఆ పార్టీ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు. సీపీఐ వ్యవస్థాపక దినోత్స వాన్ని పురస్కరించుకొని మంగళవారం అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి, బొడిగపల్లి, పోతారంజే, జనగాం గ్రామాలలో సీపీఐ జెండాలను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని, నాడు బ్రిటిష్ పాలకులు దేశాన్ని పరిపాలిస్తున్న తరుణంలో స్వాతంత్ర్యం నా జన్మ హక్కని, భారతదేశానికి బ్రిటిష్ పాలకుల నుండి విముక్తి కావాలని దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ నాయకత్వం ప్రత్యక్షంగా పాల్గొని అనేకమంది జైలు పాలయ్యారని తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సీపీఐ అనేక నిర్బంధాలను ఎదుర్కొందని దేశంలో అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మిక వర్గానికి శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, పని గంటలు తగ్గించాలని, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్వహించి ఎన్నో విజయాలను సాధించిదని తెలిపారు. ప్రజాస్వామ్యంను అపహాస్యం చేస్తూ దేశంలో కులా, మతాలవారీగా విభజించి పరిపాలిస్తున్న బిజెపి, ఎన్ డిఏకు వ్యతిరేకంగా సీపీఐ శ్రేణులు మరింత ప్రజలకు చేరువై ప్రజోద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు చిట్టల కొమురయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంద శ్రీనివాస్, బొజ్జపురి రాజు, గ్రామ శాఖ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, గాంబిరపు మధు, టి.వెంకటయ్య, మజ్జిక రాజయ్య, సి హెచ్ తిరుపతి, కొమ్ముల వెంకటయ్య, గట్టు బాబు, లింగాల బాబు, ఆనంద్, మహేందర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోట మైసమ్మ రోడ్డు పనులు పూర్తి చేస్తాం

- మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక ఇంద్ర పార్క్ నుండి కోట మైసమ్మ రోడ్డు పనులు చివరి దశకు వచ్చాయని, వీటిని పూర్తి చేయిస్తామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వం కృషితో పట్టణంలో రోడ్డు విస్తరణ జరిగినట్లు అని చెప్పారు. ఢిల్లీవాలా హెూటల్ నుండి కోట మైసమ్మ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వరకు పూర్తయినప్పటికీ కొన్ని ఇండ్లు తొలగింపులో వారికి ఇండ్ల కేటాయింపు ఆలస్యమైందన్నారు. అభివృద్ధికి ప్రజల సహకారం అందించాలన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి కోట మైసమ్మ వరకు పనులు పూర్తిచేసేందుకు సంబంధిత శాఖ అధికారులతో పాటు మున్సిపల్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇండ్లు కోల్పోయిన వారికి తగిన న్యాయం చేస్తామని అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కృషితో గజ్వేల్ పట్టణ అభివృద్ధి జరిగిందని ఆయన అన్నారు. అండర్ డ్రైనేజీ పనులు కూడా ఇంకా పూర్తి కాలేదు అన్నారు. ప్రతిపాదనలు పంపినట్లు ఆయన చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో సిసి రోడ్లు కూడా చాలా చోట్ల అవసరమైన నిధులు మంజూరైనప్పటికీ ఇంకా కొన్ని టెండర్ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. కొంతవరకు ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరిస్తామన్నారు.

పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దు

- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులు ఎవరు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదని, మీకు అండగా నేను ఉన్నానని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ వ్యక్తిగత కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం హుస్నా బాద్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా పడిపూజ సందర్భంగా అయ్యప్ప స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్య క్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజా ౦డ్డి, ప్రిన్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, మండ ల అధ్యక్షుడు వంగ వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనపై నేడు సమీక్ష సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

ప్రజాపాలనపై ఈ నెల 27న ప్రజాప్రతినిధులు, అధికారులకు నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమం ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు జరుగుతుందన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. నంగునూరు మండల సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరు కావాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి, అసెంబ్లీ ప్రత్యేక అధికారి హాజరవుతారన్నారు.

నేడు ప్రజాపాలనపై అవగాహన

నవతెలంగాణ-మద్దూరు

ఈనెల 28 నుండి జనవరి 6 వరకు జరిగే ప్రజాపాలన గ్రామసభల ఏర్పా టు గురించి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రజాపాలన అవగాహన కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరు కావాలని కోరారు

వరల్డ్ యోగా కోచ్‌గా ఉత్తీర్ణత సాధించిన తోట సంధ్య



నవతెలంగాణ-సిద్దిపేట

వరల్డ్ యోగాసన ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కోచెస్ ఫౌండేషన్ కోర్స్ 2023లో ఏప్లస్ గ్రేడ్‌తో సిద్దిపేటకు చెందిన యోగా శిక్షకురాలు తోట సంధ్య ఉత్తీర్ణత సాధించారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 13 వరకు ఆన్లైన్ ద్వారా శిక్షణ పూర్తి చేశారు. వరల్డ్ యోగాసన సెక్రటరీ జనరల్ డాక్టర్ జయదీప్ ఆర్య ఆమె ఉత్తీర్ణత సాధించినట్లు సర్టిఫికెట్ అందజేశారు.

తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో సిద్దిపేట విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో 100 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు సిద్దిపేట జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గెలు పొందిన తైక్వాండో విద్యార్థులకు బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు ముఖ్య అతిథులు సిద్దిపేట జిల్లా తైక్వాండో అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ అందజే సినట్లు తెలిపారు. బెల్ట్ ఎగ్జామ్ అబ్జర్వర్‌గా మణిపూర్ రాష్ట్రానికి చెంది న మాస్టర్ హేమంత్ వ్యవహరించారని తెలిపారు. డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి నుండి విముక్తి లభిస్తుందని, శారీరక ధృఢత్వం, ఆలోచన శక్తి పెరుగుతుందని, ఆత్మ రక్షణకు, ఆత్మ ధైర్యానికి తోడ్పడుతుందని, ప్రతి ఒక్కరూ తైక్వాండో నేర్చుకోవాలని అన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పరిశీలకుడిగా కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్



నవతెలంగాణ-సిద్దిపేట

ఈ నెల 28 నుంచి 30 వరకు నాగర్ కర్నూలు జిల్లా చారకొండలో జరిగే ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి మల్లకాంబ్ పోటీలకు పరిశీలకుడిగా రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ విధులు నిర్వహిస్తున్న కర్రోళ్ల వెంకట స్వామిగౌడ్ వ్యవహరించనున్నట్లు జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 14, 17 బాల బాలికలకు పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. రాఘవపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజు భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఏర్వ అశోక్, తోట సతీష్, బండారుపల్లి శ్రీనివాసులు, కాటం శ్రీనివాస్, పాతురి సుజాత, కడకంచి ఉప్పలయ్య, ఉపాధ్యాయ బృందం ఆయనను అభినందించారు.

ఆరు గ్యారెంటీలపై అవగాహన



నవతెలంగాణ-తొగుట

ఆరు గ్యారెంటీల పథకాల అమలును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఎంపీపీ గాంధారి లత నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టనున్న ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం విధి విధానల మీద ఈ నెల 27న మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.


చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



నవతెలంగాణ-బెజ్జంకి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన నిమ్మ ధర్మారెడ్డి(60) తన వ్యక్తిగత పనుల కోసం చిన్నకోడూర్ మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపం వద్ద ప్రధాన రోడ్డుపై ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమా దానికి గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ధర్మారెడ్డి మృతి చెందారు. పోతిరెడ్డి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరు శ్రద్ధ తీసుకోవాలని, దినచర్యలో భాగంగా వ్యాయామం కోసం ఖచ్చితంగా సమయం కేటాయిం చాలని సీఐ సత్యనారా యణ రెడ్డి తెలిపారు. వివేకానంద టీచర్స్ అసోసియేషన్ చేర్యాల ఆధ్వర్యంలో మంగళ వారం చేర్యాల పట్టణంలో చేపట్టిన 5 కె రన్ ను చుంచనకోట క్రాస్ రోడ్డు వద్ద సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో వివేకానంద టీచర్స్ అసోసియేషన్ చేర్యాల సభ్యులు, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాల పోలీసు సిబ్బంది, చేర్యాల వాకర్స్ అసోషియేషన్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 27 డిసెంబర్ 2023 | www.navatelangana.com

ఆఫీసర్లు నిర్లక్ష్యం చేయొద్దు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామానుజచార్యులు

నవతెలంగాణ మునిపల్లి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజాపాలన ప్రోగ్రామ్ను సక్సెస్ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఇడి, మండల స్పెషలాఫీసర్ రామానుజచార్యులు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం మునిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అంటే ఏంటో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రోగ్రామ్లో అధికారులకు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఆరు గ్యారంటీ పథకాల సందర్భంగా దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదే విధంగా మండలంలోని రెండు టీంలుగా ఎంపీడీఓ, తహసీల్దార్ల పర్యవేక్షణలో నిర్వహిస్తునట్లు తెలిపారు. గ్రామ సభకు ముందురోజుల చాటింపు వేయించేలా చూడాలని సంబంధిత పంచాయతీ స్పెషలాఫీసర్లను ఆదేశించారు. మహిళలకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీఓ డాక్టర్ హరినందన్ రావు, తహసీల్దార్ తెన్మొళి, ఎంపీఓ అంజనీదేవి, ఆయా శాఖల అధికారులు, గ్రామాల స్పెషలాఫీసర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొన్నె తిరుమలయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి ఆటో డ్రైవర్స్ మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి జగదేవ్‌పూర్ ఆటో యూనియన్ తరపున రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ గుంటి కృష్ణ ఆనమైన వెంకటేష్ రాసాల కరుణాకర్ కొంపెల్లి నాగరాజు ఇటికాల రాములు బో ల్లపల్లి మల్లేశం కొంపల్లి ఉపేందర్ వల్లపు కనకయ్య దోమ రంగులు రాగుల శ్రీనివాస్ దేవుని రమేష్ పీర్లపల్లి మల్లయ్య బత్తిని నరసింహులు చెక్కల కర్ణాకర్ పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న రాజీవ్ పార్క్

- గజ్వేల్ పట్టణంలో ఏకైక పార్క్
- ప్రజల సందర్శనానికి నోచుకోని హెర్బల్ పార్కు
- సొంత వాహనాలు ఉంటే అర్బన్ పార్క్ వెళుతున్న ప్రజలు
- మున్సిపల్‌లో మరిన్ని పార్కులు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో కనువిందు చేసేలా రాజీవ్ పార్కును తీర్చిదిద్దారు. నిత్యం ప్రజలు, చిన్నారులతో పార్కు కళకళలాడుతోంది. 2004లో అప్పటి టూరిజం శాఖ మంత్రి డాక్టర్ జే గీతారెడ్డి తన జన్మదిన కానుక గజ్వేల్ పట్టణం రాజిరెడ్డిపల్లి సమీపంలో పార్క్ ఏర్పాటు చేశారు. 2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు కావడం గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుండి కెసిఆర్ ఎమ్మెల్యేగా గెలుపొందడం... ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తరువాత పార్కులను పునరుద్ధించాలని ఆదేశించారు. పార్కు చిన్నగా ఉందని పక్కకు ఉన్న స్థలాన్ని మరింతగా తీసుకొని పెంచాలని సూచించడంతో అప్పటి స్పెషల్ అధికారి హనుమంతరావు పాత పార్కు తొలగించి కొత్త పార్కు 2016 లో శంకుస్థాపన చేశారు. పార్కు మరిన్ని నిధులు కేటాయించి పునరుద్ధరించి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చివరి దశలో ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఏకైక పార్కుగా రాజీవ్ పార్క్ మాత్రమే. ప్రస్తుతం పార్కు అందుబాటులో రావడం వల్ల ప్రజలు ఉదయం సాయంత్రం పార్కు వెళ్లి కాలక్షేపాలు చేస్తున్నారు. పెద్దలు చిన్న తేడా లేకుండా పార్కు వెళ్లి వస్తున్నారు. మున్సిపల్ అధికారుల సమక్షంలో పార్కులో అన్ని వసతులు పూర్తి కాలేదు. గతంలో పార్కులో బేకరీ, టీ ఉండేది కానీ ప్రస్తుతం వాటిని ఇంకా అందుబాటులో తీసుకురాలేదు. చిన్న చిన్న ఫంక్షన్లకు ఏర్పాటు చేసుకునేలా పార్కులో నిర్మాణం చేశారు. పుట్టినరోజు, ఇతర సంస్కృతి సాంప్రదాయ కార్యక్రమాలకు ఏర్పాటు చేసుకున్నందుకు వేదికను ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో వారిని భారీగా ఆకట్టుకుంటుంది. మానవ చేతుల రూపంలో చాలా చోట్ల వేదికలు ఏర్పాటు చేశారు. జింకలు పలుచోట్ల ఏర్పాటు చేయడం వల్ల పార్కు ఆకర్షణ అందంగా అందరి ఆకట్టుకుంటుంది. చిన్నలు పెద్దలు కూర్చునేలా అక్కడ కుర్చీలు బెంచీలను ఏర్పాటు చేశారు. పార్క్ మొత్తం ఆకుపచ్చ గ్రాస్ ఏర్పాటు చేయడం వివిధ రకాల చెట్లను మొక్కలు నాటి మున్సిపల్ సిబ్బంది నిత్యం శుభ్రంగా ఉంచుతున్నారు. వాటర్ ఫైర్ ను ఏర్పాటు చేశారు. వాటర్ ఫైర్ పలువురి ఆకట్టుకుంటుంది. గతంలో కూడా 50 లక్షలరూపాయలు వెచ్చించి పార్కులు రూపుదిద్దుగా ప్రస్తుతం 50 లక్షలతో పార్కును పూర్తి చేశారు. మరికొంత పనులు ఉన్నప్పటికీ ప్రజలు నిత్యం సందర్శన కనిపించడంతో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఏకైక పార్కుగా ఉన్నది. ప్రజ్ఞాపూర్ గ్రామంలో కూడా మరో పార్కును ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పాలకులు పట్టించుకోలేదు. స్థానిక కౌన్సిల్ సభ్యులు అనేకసార్లు అప్పటి మంత్రులు దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేకపోయింది. ఇదిలా ఉండగా హౌసింగ్ బోర్డ్ సమీపంలో హెర్బల్ పార్క్ ఉన్నప్పటికీ అందులోకి ప్రజల సందర్శనకు అవకాశం లేకపోయింది. పాండవులు చెరువు పై పార్క్ ఏర్పాటు చేయగా అక్కడ కూడా పూర్తిగా ఎండిపోతున్నాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కు ఏకైక పార్కు రాజీవ్ పార్కుగా ఉన్నది. మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ సమీపంలో 175 ఎకరాల్లో అర్బన్ పార్క్ నిర్వహించినప్పటికీ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల ప్రత్యేక వాహనాల ఉన్నవారు మాత్రమే అక్కడికి వెళ్తున్నారు. గజ్వేల్ పట్టణంలో ఉన్న పార్కు ప్రజల సందర్శన ఎక్కువవుతుంది. ఇంకా టికెట్ ఖరారు చేయలేదు. ప్రజల సందర్శనం చిన్నారుల కేరింతలు పార్కులో నిత్యం కనిపిస్తున్నాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లో 50 వేల జనాభా తోపాటు వివిధ ప్రాంతాల నుండి మరో 50 వేల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తారు. కాలక్షేపం చేయాలంటే ఒకే ఒక పార్క్ ఉండటం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. ఉద్యోగులు, ఇతర వ్యాపారాలు చేసుకునే కుటుంబాలు సాయంత్రం పూట పిల్లాపాపలతో పార్కు వస్తున్నారు. మరికొందరు హెర్బల్ పార్క్ కూడా సందర్శనకు అనుమతించాలని కోరినప్పటికీ ఇప్పటివరకు అమల్లోకి రాలేదు. ఉన్న ఒక్క పార్కు అలసట తీర్చుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు అంటున్నారు. చల్లని కబుర్లు మంచి వాతావరణం పిల్లల కావలసిన ఆట వస్తువులు ఏర్పాటు చేయడం వల్ల పార్కు వైపు ప్రజలను ఆకర్షిస్తుంది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మరిన్ని పార్కులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.






రెండో రోజు అదే జోష్

మెదక్ చర్చి ప్రాంగణంలో బాక్సింగ్ డే



నవతెలంగాణ-మెదక్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రెండోరోజు జోష్ తగ్గలేదు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. చర్చి ప్రిసిబిటర్ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, పాస్టర్లు భక్తులను ఆశీర్వదించారు. చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు చిన్నారులు, యువతను ఆకర్షించాయి. భక్తులు, పర్యాటకుల కొనుగోళ్లతో కిటకిటలాడాయి. మెదక్ డీఎస్పీ ఫణీంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. భక్తుల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా భక్తులు కానుకలుగా ఇచ్చిన మేకలు, గొర్రెలకు వేలం పాట నిర్వహించారు. అలాగే బాక్సింగ్ డేను పురస్కరించుకొని చర్చి ప్రాంగణంలో చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహాయక గురువు రెవరెండ్ డేవిడ్ రిచర్డ్, సంఘ నాయకులు గంట సంపత్, సువన్ డగ్లస్, శాంసన్ సందీప్, గెలెన్, నోబుల్ సన్, ప్రభాకర్, దేవ ప్రకాష్, జోసఫ్ శాంతి కుమార్, సుశీల్ కుమార్, అజయ్, సునీల్, మానయ్య, సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన ప్రారంభించేది ఎప్పుడు?

ఇబ్బందులకు గురవుతున్న పేషంట్లు
వెంటనే ప్రారంభించాలని గ్రామస్తుల వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిజాంపేట మండల కేంద్రానికి పల్లె దావఖాన మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందుకు ప్రభుత్వం దాదాపు రూ.16 లక్షలు మంజూరు చేసింది. బిల్డింగ్ మాత్రం పూర్తి అయినప్పటికీ ప్రారంభించడానికి ఆలస్యం ఎందుకో అర్థం కావడం లేదు. ఎప్పుడో ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ నేటికీ ప్రారంభించకపోవడం విచారించదగ్గ విషయమే. పల్లె దావఖాన లేక పేషంట్లు ఎక్కడ చూపించుకోవాలో తెలవక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు కూడా స్పందించడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నట్లయితే ఎప్పుడో ప్రారంభించే వారని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్పందించి పల్లె దావఖానాను ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పల్లె దావఖానాను వెంటనే ప్రారంభించాలి



రాష్ట్రంలో అన్ని మండలాలలో పల్లె దవఖానాలు ప్రారంభించారని నిజాంపేట మండల కేంద్రంలో పల్లె దావఖానాను నిర్మించారు కాని ప్రారంభించలేదు. అధికారుల అలసత్వం వల్లనే నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. పేషంట్లు కూడా చాలా ఇబ్బందులు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పల్లె దవాఖానాను వెంటనే ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలి.

– పంజాబాబు, నిజాంపేట

కేవల్ కిషన్ ఉద్యమ స్ఫూర్తితో యువకులు కదలాలి

కామ్రేడ్ కేవల్ కిషన్ 64వ వర్థంతి
సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం

నవతెలంగాణ-హవెలిఘనాపూర్




కేవల్ కిషన్ ఉద్యమ స్ఫూర్తితో నేటి యువత ముందుకు కదలాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం అన్నారు. కేవల్ కిషన్ 64వ వర్థంతి సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని జక్కన్నపేట్ గ్రామంలో కేవల్ కిషన్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం పాల్గొని మాట్లాడుతూ కేవల్ కిషన్ బడుగు, బలహీన మధ్య తరగతి ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆనాటి కాలంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజలకు భూములు పంచాలని, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజలను ఏకం చేసి పోరుబాట పట్టారని కొనియాడారు. కేవల్ కిషన్ ఆశయాల సాధన కోసం పోరాడదామని, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకను గుణంగా ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ కార్యవర్గ సభ్యులు కే మల్లేశం, నరసమ్మ, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు భీమేష్, కర్ణాకర్, దాసు, రాజయ్య ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పాపన్నపేట

మండల కేంద్రంలో మంగళవారం కామ్రేడ్ కేవల్ కిషన్ వర్ధంతిని నిర్వహించారు. మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కేవల్ కిషన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ కేవల్ కిషన్ పేద ప్రజల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. భూమి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కాగా 1960 డిసెంబర్ 26వ తేదీన మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని పొలం పల్లి వద్ద రాత్రి 11:30 గంటలకు మృతి చెందారు. అయితే ఈయనను భూస్వాములు హత్య చేసి రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని చిత్రీకరించారని అనుమానిస్తున్నారు. ఆ రోజుల్లోనే తహసీల్దార్ ఉద్యోగం వస్తే కూడా వదులుకుని పేదల పక్షాన నిలబడి అందరి గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేసుకున్నారు. పెత్తందారుల భూస్వాములకు ఎదురు నిలిచి ప్రజా సమస్యలు పరిష్కరించారన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముశెట్టి కిష్టయ్య, ముదిరాజ్ యువజన సంఘం మండల అధ్యక్షుడు కుర్తివాడ కిరణ్, ప్రధాన కార్యదర్శి కర్రెల వెంకటేశం, ఉపాధ్యక్షుడు బాచారం గణేశ్, కోరబోయిన బాల్ రాజ్, విగ్నేష్ , రమేశ్, శ్రీశైలం, రవి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



నవతెలంగాణ-కొల్చారం: ప్రజాపాలన నిర్వహణ కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని జిల్లా యువజన సంక్షేమ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతోపాటు ఆయా శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి నాగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వ హించి ప్రజల నుంచి మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని తెలిపారు. అలాగే డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. తహసిల్దార్, ఎంపీ డీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి, ప్రతిరోజు ప్రతి బృందం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంట ల వరకు రెండు షెడ్యూల్లో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అదేవిధంగా ప్రజా పాలన సభలలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటిం చాలని, దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు పూర్తి చేసి గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలోని నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరిం చేలా చూడాలన్నారు. సభకు వచ్చే వృద్దులకు, వికలాంగు లకు, వీల్ చైర్ సౌకర్యం కల్పించాలని, ప్రతిరోజు ప్రజాపా లన సభలలో తీసుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు కం ప్యూటర్‌లో నమోదు చేసి దరఖాస్తుదారునికి రసీదు అందిం చాలన్నారు. డిఎల్‌పిఓ యాదయ్య, ఎంపీడీవో గణేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్ ఇర్ఫాన్ హుస్సేన్, ఏపీవో మహిపాల్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచులు గోదావరి, నెల్లి కిష్టయ్య, కరెంటు ఉమాదేవి రాజా గౌడ్, మోతి పాండు నాయక్, మాధవి శ్రీశైలం, ఆంజనేయులు, స్వాతి, మౌనిక, ప్రియాంక, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గోసంతతిని అభివద్ధి చేయాలి

నవతెలంగాణ-అమీన్ పూర్



గోసంతతిని అభివద్ధి చేసి గోవు నుంచి వచ్చే లాభాలను సద్వినియోగం చేసుకోవాలని గోశాల చైర్మెన్ సోహన్ లాల్ దయిమా అన్నారు. బీరంగూడలో ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాలలో 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రత్యేక గోపూజలో పాల్గొన్నారు. అనంతరం గోవు గురించి మాట్లాడారు. గోవు ఉన్న పరిసరాలు రోగ నిరోధక ప్రాంతాలుగా ఉంటాయన్నారు. గోవు ఉన్న ఇల్లు అష్టఐశ్వర్యాలకు నిలయంగా ఉంటుందన్నారు. గోవు పాలు తాగడంతో శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గో మూత్రం, గోమయం, పాలు, పెరుగు, నెయ్యి తీసుకోవడంతో అనేక రోగాలు రాకుండా ఆరోగ్యంగా జీవించగలుగుతామన్నారు. ప్రతి ఒక్కరూ గోవు నుంచి లభించే లాభాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోశాల ఆధ్వర్యంలో సుమారు వేయి ఆవుల సంరక్షణ చేస్తున్నట్టు చెప్పారు. భారతదేశంలో వ్యవసాయానికి గోసంపద ఎంతో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇలాంటి గోశాలలను ప్రొత్సహించి ప్రతి ఇంటికి గోవులను పెంచేస్థాయికి చేరాలని సూచించారు. గోశాల అధ్యక్షుడు ఏనుగు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో గో సంపద అంతరించిపోయే స్థితికి వచ్చిందన్నారు. గోసంరక్షణ చేయకపోతే భవిష్యత్లో గోవులను గోశాలలు, జంతుప్రదర్శనశాలలో చూడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి ఇంటికి ఒక గోవును పెంచేందుకు కృషి చేయాలన్నారు. పదమూడేళ్ల క్రితం ఐదు గోవులతో గోశాలను స్థాపించి సుమారు వెయ్యి గోవులను సంరక్షిస్తున్నామని తెలిపారు. రాజస్థానీ యులు, స్థానికుల సహకారంతో గోశాల నిర్వహణ చేయగలుగుతున్నామన్నారు. ప్రభుత్వం సహకరించి సహాయం అందిస్తే జిల్లాలో ప్రతి గ్రామంలో గోశాలలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. గోశాల కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ వార్డు సభ్యుడు కొల్లూరు మల్లేష్, పొన్న సీనయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రవ ంలో అమీన్ పూర్ పురపాలక అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బాజాప రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల రమేష్ నాయకులు లింగం గౌడ్, భాస్కర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు విట్టల్, భూపాల్ రెడ్డి, సుఖదేవ్ జోషి, రాజేందర్ తివారి, తిరుమలరెడ్డి లక్ష్మణ్, జయ కష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-చేగుంట

ప్రజలకు చేరువగా పాలన అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపడుతుందని తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన అవగాహన సదస్సు ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రజా పాలన అన్ని గ్రామాలలో డిసెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభమై జనవరి ఆరవ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు స్కీములకు దరఖాస్తులు ప్రజల వద్ద నుంచి తీసుకోవాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. స్త్రీలకు, పురుషులకు వేరువేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, గ్రామ సభకు ముందు రోజు లబ్దిదారునికి దరఖాస్తు ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక అధికారి జమ్లా నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. వృద్ధులు, వికలాంగులకు, ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఈ ఐదు స్కీములు తెల్ల రేషన్ కార్డు ఉన్న వాళ్ళు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాలలో అధికారులు ప్రత్యేక చొరవ చూపి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జమ్లు నాయక్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పిటిసి శ్రీనివాస్, తహసీల్దార్ గియస్ ఉన్నిసాబేగం, ఎంపీఓ, ఆర్ఐ యాదగిరి యాదవ్, ట్రాన్స్‌కో రాములు, ఏవో హరిప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభల్లో ఆర్జీలను స్వీకరించాలి




నవతెలంగాణ-వెల్దుర్తి

గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు జెడ్పిటిసి రమేష్ గౌడ్, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, తహసిల్దార్ తులసి రామ్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజాపాలన, ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించిన గ్రామసభల విధివిధానాలపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు

గ్రామసభల వివరాలు

డిసెంబరు 28 నుంచి వచ్చే నెల 6వ తేది వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం, మధ్యాహ్నం గ్రామ సభలను నిర్వహించనున్నారు. ఈ నెల 28న మానెపల్లి, అందుగులపల్లి, హస్తాల్పూర్, నెల్లూరులో, 29న యశ్వంతరావుపేట్, మంగళపర్తి, బండ పోసాని పల్లి, ఈదులపల్లి, బొమ్మారం, స్టేషన్ మాసాయిపేట్, రామంతపూర్ తాండ, రామంతపూర్‌లలో గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ నెల 30న మన్నె వారి జలాల్పూర్, మహమ్మద్ నగర్ తండా, ధర్మారం, మాసాయిపేట్, జనవరి 2న దామరంచ, కుకునూరు, రామయ్య పల్లి, శెట్టిపల్లి కలాం, 3న చర్లపల్లి, శంషా రెడ్డి పల్లి తండా, వెల్దుర్తి, బస్వాపూర్, 4న ఉప్పులింగాపూర్ గ్రామ పంచాయతీల్లో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించి దరఖాస్తులు తీసుకోనున్నట్లు చెప్పారు. 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున అన్ని గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవో వెంకటలక్ష్మి తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి ఐకెపి, అంగన్వాడి టీచర్ల, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.